www.jananinadam.com
RNI NO.TELTEL /12314

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

Follow :

Simultaneously published from Asifabad & Hyderabad.
ఎడిటర్ జాధవ్ రోహిదాస్ | సంపుటి : 1 సంచిక:203 | శుక్రవారం 20-12- 2024 | పేజీలు: 5 | వెల: రూ.3.00



## విలెకర్లు కావలెను

జననినాదం

ప్రతి అక్షరం సామాన్యుడి అయుధవ తెలుగు దినపత్రిక

సమాజం,స్థానిక రాజకీయ అంశాలపట్లకనీసం అవగాహన కలిగి ఉండి చక్కని రాత,ఓర్పు,నేర్పుగల జర్నలిస్టులకు (జననినాదం) తెలుగుదినపత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలో పాత్రికేయులుగా ప్రతిభను చాటేందుకు అసక్తిగల వారు సంప్రదించగలరు.

సంప్రదించాల్సిన నెంబర్ 9550100197 9490111460



## దేశవ్యాప్తంగా పెరిగిన చలి తీవ్రత

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా చలిగాలులు పెరగడంతో పాటు దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర,. దక్షిణాది రాష్ట్రాలను సైతం చలి గాలులు వణికిస్తున్నాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 0 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల నుండి 4 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గినట్లు తెలిపింది. మధ్యప్రదేశ్‌లో సైతం కనిష్ట ఉష్ణోగ్రత 7డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. గ్వాలియర్‌ను దట్టమైన పొగమంచు, చలి చుట్టుముట్టాయి. పొగమంచు కారణంగా విజిబిలిటీ (దృశ్యమాన్యత) పడిపోయిందని ఐఎండి తెలిపింది. మరోవైపు, రాబోయే ఐదు నుండి ఏడు రోజుల్లో వాయువ్య భారత్‌లోని పలు రాష్ట్రాలపై తీవ్ర చలిగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. చలిగాలుల ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపైనా పడింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కర్ణాటకలోనూ ఉష్ణోగ్రతలు 5 నుండి 6 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో రాష్ట్రంలో ఇంత తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డు కావడం ఇదే మొదటిసారి అని స్థానికులు పేర్కొన్నారు. కర్ణాటకలో 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది.



## పార్లమెంట్ వద్ద గందరగోళ వాతావరణం



- పరస్పర ఆందోళనలకు దిగిన కాంగ్రెస్, బిజెపి పక్షాలు
- తోపులాటలో ఇద్దరు బిజెపి ఎంపిలకు గాయాలు
- ఇద్దరినీ చికిత్స కోసం అస్పత్రికి తరలింపు
- తమను కావాలనే అడ్డుకున్నారని రాహుల్ ఎదురుదాడి

న్యూఢిల్లీ,డిసెంబర్19 : పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. పరస్పర తోపులాటల్లో బిజెపి ఎంపిలు ఇద్దరికి గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిని ఆస్పత్రికి తరలించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం కూడా నిరసన చేపట్టారు. ఇరువర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాజపాకు చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తోయడం వల్లే వీరు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తోంది. పార్లమెంట్‌లోని మకరద్వారం వద్ద ఉన్న గోడ ఎక్కి ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు ప్లకార్డులు చూపిస్తూ ఆందోళన చేపట్టారు. అదే సమయంలో అక్కడకు ఎన్డీయే కూటమి ఎంపీలు వచ్చారు.



## భారత్‌కు ట్రంప్ హెచ్చరిక

2వ పేజీలో...

వాషింగ్టన్ : తమ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారత్ సహా పలు దేశాలు అధిక పన్నులు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అలాగే ఎక్కువ పన్నులు వసూలు చేస్తామని ఆయన విలేకరులతో అన్నారు.

## అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు

### అసెంబ్లీ ముందు తెలంగాణ కాంగ్రెస్ నేతల ధర్నా

తమకు దేవుడికన్నా ఎక్కువేనన్న పిసిసి చీఫ్





## ‘బలగం’ మొగిలయ్య ఇకలేరు

- బలగం సినిమాతో గుర్తింపు పొందిన జానపద కళాకారుడు మొగిలయ్య
- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మొగిలయ్య
- వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

జననినాదం,వరంగల్, ప్రతినిధి, డిసెంబర్ 19: ‘బలగం’ సినిమాతో గుర్తింపు పొందిన జానపద కళాకారుడు మొగిలయ్య కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మొగిలియ్య.. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా ఆయన గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దాంతో మొగిలయ్య చికిత్స కోసం నటుడు చిరంజీవి, ‘బలగం’ మూవీ దర్శకుడు వేణు చేయూత అందించారు. ఇటీవల ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని సంరక్ష ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈరోజు కన్నుమూశారు. కాగా, ‘బలగం’ సినిమాలో క్లైమాక్స్‌లో వచ్చే భావోద్వేగభరితమైన పాటను ఆలపించి మొగిలయ్య ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నారు. గ్రామీణ నేపథ్యంలో వచ్చిన ఈ మూవీ ఘన విజయం సాధించడంతో మొగిలయ్యకు మంచి గుర్తింపు వచ్చింది.



## జమ్మూకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### -ఐదుగురు ఉగ్రవాదులు మృతి

కుల్గామ్: జమ్మూకాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. జమ్మూ కాశ్మీర్ పోలీసుల కథనం ప్రకారం, కుల్గాం జిల్లాలోని కద్దర్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా భద్రతా బలగాలపై కాల్పులు జరిపారని తెలిపారు. ఈ కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మృతి చెందగా, మరో ఇద్దరిని ప్రాణాలతో పట్టుకున్నారని అధికారులు తెలిపారు. కద్దర్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నాయి. ఐదుగురు ఉగ్రవాదులు హతమైనట్లు అనుమానిస్తున్నట్లు భద్రతా బలగాలు తెలిపాయి. అయితే ఇప్పటి వరకు ఎలాంటి మృతదేహాలు లభ్యం కాలేదని అధికారులు తెలిపారు.

## తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల



హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు ఎస్ఎస్‌సి బోర్డు తెలిపింది. మార్చి 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న ఇంగ్లీష్, 26న గణితం, 28న ఫిజిక్స్, 29న ఎస్ఎస్, ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 3న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పరీక్ష, 4న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది.



## తెలంగాణ అసెంబ్లీలో ఆగని మంటలు..


2వ పేజీలో...



2వ పేజీలో...

## ఇక కేసీఆర్ వంతేనా

హైదరాబాద్, : గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అధికారం అడ్డం పెట్టుకుని.. కేసీఆర్ ఇష్టానుసారంగా తీసుకున్న నిర్ణయాలే.. ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకుంటున్నాయి. కేసీఆర్ హయాంలో పదేళ్లపాటు చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలు, ప్లాంట్ల నిర్మాణంలో తప్పిదాలు బయటపడ్డాయి. వీటిపై జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ విచారణ జరిపి నివేదికను రెడీ చేసింది. రీసెంట్‌గా ఈ నివేదికను తెలంగాణ మంత్రివర్గం ఆమోదించింది.



2వ పేజీలో...

## మందమర్రి మండలంలో.. పులి సంచారం

### భయాందోళనలో స్థానికులు..



## కాంగ్రెస్ వల్ల క్వశ్చన్ అవర్ అర్థమే మారిపోయింది

## కీలక నిర్ణయాలకు ఏపీ కేబినెట్ ఆమోదం



అమరావతి,డిసెంబర్ 19 : ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో రూ. 24,276 కోట్ల విలువైన పనులకు పాలనాపరమైన అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి హడ్కో ద్వారా రూ. 11 వేల కోట్లు రుణానికి, కేఎఫ్‌డబ్ల్యూ ఆర్థిక సంస్థ ద్వారా రూ. 5 వేల కోట్ల రుణానికి ఆమోదం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాల్వ పనులకు మళ్లీ టెండర్లు పిలిచే ప్రతిపాదనకు, హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్‌కు అనుమతి నిస్తూ నిర్ణయం తీసుకుంది. వర్షకాలంలో భారీ వర్షాలకు నష్టపోయిన 10 జిల్లాలోని వరద ప్రభావిత బాధితులకు రుణాల రీ షెడ్యూల్‌పై, రైతులకు రుణాల రీషెడ్యూల్ కోసం స్టాంప్ డ్యూటీ మినహాయించే ప్రతిపాదనపై చర్చ కొనసాగింది. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు ఉచితంగా ఇచ్చే అంశం,ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి నిధుల విడుదలపై చర్చ జరిగింది. ధాన్యం కొనుగోలు కోసం మార్క్‌ఫెడ్ ద్వారా వెయ్యి కోట్ల రుణానికి ఆమోదం వ్యక్తం చేసిన కేబినెట్ వెయ్యి కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారంటీకి ఆమోదం తెలిపింది . మంగళగిరి ఎయిమ్స్‌కు అదనంగా మరో 10 ఎకరాల భూమి కేటాయించడానికి నిర్ణయం తీసుకుంది.

## ఇక కేసీఆర్ వంతేనా

మొదటిపేజీ తరువాయి...

ఈ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు..ఇతర పాత్రధారులపైన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది.ఇక విద్యుత్ ఒప్పందాలతో పాటు.. ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన తప్పిదాలపై.. జస్టిస్ మదన్ కమిషన్ రెడీ చేసిన నివేదికను.. ప్రస్తుతం కొనసాగుతున్నఅసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కేబినెట్ తీర్మానించింది. నివేదికపై సభలో విస్తృతంగా చర్చించిన తర్వాత.. మాజీ సీఎం కేసీఆర్‌పై తీసుకునే చర్యలకు సంబంధించి.. అసెంబ్లీ సాక్షిగానే ప్రకటన చేయనుంది ప్రభుత్వం. దీని ఆధారంగా కేసీఆర్ సహా పలువురిపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు కూడా అధికార వర్గాలు తెలిపాయి. నిన్న జరిగిన కేబినెట్ మీట్‌లో ప్రధానంగా విద్యుత్తు కమిషన్ నివేదికపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. పదేళ్ల కాలంలో కేసీఆర్ డిస్కమ్‌లను ఆర్థికంగా కుప్ప కూల్చారని, ఆయన మెప్పు కోసం విద్యుత్తు సంస్థలు మునుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని కమిషన్ తేల్చింది. విద్యుత్తు కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలతో.. రానున్న 25 ఏళ్లపాటు తెలంగాణ సమాజం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కమిషన్ అభిప్రాయ పడింది. కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా? రానున్న 25 ఏళ్లలో 9వేల కోట్ల దాకా ప్రజలపై భారం పడనుందని అభిప్రాయపడింది.సూపర్ క్రిటికల్‌తో పోల్చుకుంటే సబ్ క్రిటికల్‌లో ప్లాంట్ ఆక్సిలరీ కన్జంప్షన్, హీట్ రేట్, మెయింటినెన్స్ తదితర ఖర్చులు ఏటా 350 కోట్ల వరకూ అదనంగా పడతాయని, ప్లాంటు జీవిత కాలం 25 ఏళ్లకు దాదాపు 9వేల కోట్ల వరకూ అదనపు భారం పడుతుందని క్యాబినెట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక, ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతో.. కూడా 3వేల 642 కోట్ల నష్టం జరిగిందని నివేదిక తేల్చింది. ఒక యూనిట్ విద్యుత్‌ను తొలుత మూడు రూపాయల అరవై పైసలకే కొన్న ప్రభుత్వం.. ఆ తర్వాత ఇంధన సర్దుబాటు పేరిట ఏడు రూపాయలకు కొనడాన్ని కేబినెట్ తప్పుబట్టింది.వెయ్యి మెగావాట్ల కరెంట్‌ను తీసుకోవడానికి ఛత్తీసగఢ్‌తో ఒప్పందం చేసుకున్నా.. దానికి తగినట్టుగా ఆ రాష్ట్రం కరెంట్ ఇవ్వలేదని కమిషన్ తేల్చింది. దాంతో ఓపెన్ యాక్సె?సలో కొనుగోలు చేయాల్సి వచ్చిందని.. ఫలితంగా 2వేల కోట్ల అదనపు భారం తెలంగాణపై పడిందని కమిషన్ రిపోర్ట్ ఇచ్చించి ప్రభుత్వానికి.

## అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి...



హైదరాబాద్,డిసెంబర్19 : అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని తెలంగాణ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పార్లమెంట్ లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. అమిత్ షా అంబేద్కర్ ను అవమానపరిచారని.. ఆయన వెంటనే రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అసెంబ్లీలోని గాంధీ విగ్రహం దగ్గర ఆందోళన చేశారు.మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ఆందోళనలో పాల్గొన్నారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఈ ధర్నా చేస్తోంది. అంబేద్కర్ తమకు దేవుడు లెక్క అని, అమిత్ షా క్షమాపణలు చెప్పాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేకి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నినాదాలు చేసింది. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 'మేము దేవుళ్లను ఆరాధిస్తాం. డా.బీఆర్ అంబేద్కర్ కూడా మాకు దేవుడు లెక్క. అంబేద్కర్‌పై చేసిన వాఖ్యలు ప్రజల మనుసుని గాయపర్చాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాటలు అగ్రవర్ణాల పోకడను గుర్తు చేసేలా ఉన్నాయి. అమిత్ షాను బర్థరఫ్ చేస్తే ప్రజల మనసుకు కలిగిన గాయానికి కొంత ఊరట కలిగినట్లు ఉంటుంది. వెంటనే ప్రధాని మోడీ స్పందించి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని పిసిసి చీఫ్ అన్నారు. ఈ ఆందోళనలో మంత్రి పొన్నంతో పాటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ కుమార్,పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అంబేద్కర్..అంబేద్కర్. . అంబేద్కర్ అని అనడం ఈ మధ్య ఫ్యాషన్ అయిపోయింది.. అంబేద్కర్ పేరు కంటే.. దేవుడి పేరు స్మరించినా స్వర్గానికి వెళ్లేవారు అంటూ రాజ్యసభలో అమిత్ చేసిన వ్యాఖ్యలు గత రెండు రోజులుగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. అంబేద్కర్‌ను నిండు సభలో అమిత్ షా అవమానించారని.. ఆయన వెంటనే రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు ఆందోళనకు దిగాయి. గురువారం కూడా పార్లమెంట్ భవనం ముందు కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని ఇతర పార్టీల ఎంపీల పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. అంబేద్కర్ చిత్రపటాలను చేతిలో పట్టుకుని జై భీం.. జై జై భీం నినాదాలతో ఎంపీలు హోరెత్తించారు.

## తెలంగాణ అసెంబ్లీలో ఆగని మంటలు..

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, డిసెంబర్ 19, : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా సాగుతున్నాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య గురువారం మాటల యుద్ధం కొనసాగింది. సభా కార్యకలాపాలపై సరిగ్గా సమాచారం ఇవ్వడం లేదని.. ఎలాంటి సమాచారం లేకుండానే ఆర్థిక పరిస్థితిపై చర్చ పెట్టారని విపక్షాలు తీవ్ర అసహనం వ్యక్తం చేశాయి. సభ నడిపే తీరు ఇది కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలపగా.. శాసనసభ నిబంధనల ప్రకారం సభ నిర్వహించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్.. స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. సభ్యులకు కనీసం సమాచారం లేకుండా ఎలా మాట్లాడుతారని.. బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య అసెంబ్లీలో తీవ్ర వాగ్వాదం జరిగి సభలో గందరగోళం నెలకొంది. కాగా, విపక్షాల విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. 'సభ నిర్వహణలో కొంత సమాచారం లోపం జరిగింది. దీనికే స్పీకర్ సారీ చెబుతారా.?. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందే. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు. హరీశ్‌రావు, అక్బరుద్దీన్.. ఇద్దరూ సీనియర్ సభ్యులు. వారు ఏదైనా చెప్పాలనుకుంటే రిక్వెస్ట్ చేయాలి. అంతేకానీ హుకుం జారీ చెయ్యొద్దు. తప్పు చేస్తే తప్పకుండా క్షమాపణ చెబుతాం. ఎంతో ముఖ్యమైన అంశంపై సభలో చర్చ కొనసాగుతుండగా.. చర్చను పక్కదారి పట్టించేందుకే ఇదంతా చేస్తున్నారు. సభ సజావుగా జరగాలని బీఆర్ఎస్ నేతలు భావించడం లేదు. ప్రభుత్వపరంగా ఏదైనా పొరపాటు జరిగితే శాసనసభ వ్యవహారాల మంత్రిగా నేను బాధ్యత తీసుకుంటాను. జవాబుదారీగా ఉంటా.. అంతేకానీ స్పీకర్ క్షమాపణ చెప్పాలంటే ఎలా సాధ్య అవుతుంది.?' శ్రీధర్ బాబు ప్రశ్నించారు.అటు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. హరీష్ రావు మధ్య కూడా అసెంబ్లీలో వాడీవేడీ వాదన సాగింది. నల్గొండ జిల్లాలో నీటి సమస్యపై మంత్రి ప్రస్తావించారు. ఓ వైపు ఫ్లోరైడ్, మరోవైపు మూసీ మురుగునీటితో ప్రజలు దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో పూర్తి చేసిన 70 శాతం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. పదేళ్లలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినా దీన్ని పూర్తి చేయలేదన్నారు. తమ ప్రభుత్వం గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తి చేసిందని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 40 లక్షల మంది జీవితాలను కాపాడాలని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.దీనిపై స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు.. 'సభలో ఓ మంత్రి లేచి మరో మంత్రిని ప్రశ్నించే పరిస్థితి ఉండకూడదు. ఇలా ప్రశ్నలు అడిగేందుకు అవకాశం ఇస్తే ప్రశ్నోత్తరాలకు అర్థవే మారిపోతుంది. లేని సంస్కృతిని తీసుకురావొద్దు.' అని పేర్కొన్నారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఘాటుగా స్పందించారు. 'హరీష్ రావు బీఆర్ఎస్‌కు డిప్యూటీ లీడరా? ఎమ్మెల్యేనా?. ఏ హోదాతో మాట్లాడుతున్నారు.?. ఆయనకు ప్రశ్నించే హక్కు లేదు. ప్రతిపక్ష నేత ఏడాదిగా సభకు హాజరు కాకపోవడం, తెలంగాణ ప్రజలను అవమానపరచడమే.' అంటూ మండిపడ్డారు.

## పార్లమెంట్ వద్ద గందరగోళ వాతావరణం




వీరిని లోపలికి వెళ్లకుండా విపక్ష నేతలు అడ్డుకున్నారని భాజపా ఆరోపించింది. ఈ క్రమంలోనే కొంత గందరగోళం చోటుచేసుకుని భాజపా ఎంపీలు ముకేశ్ రాజ్‌పుత్, ప్రతాప్ చంద్ర సారంగి కిందపడి గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్‌కు ఐసీయూలో చికిత్స అందించారు. మరో ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి తలకు గాయమైంది. వీరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు స్పందించారు. 'ఇద్దరు ఎంపీల తలలకు దెబ్బలు తగిలాయి. సారంగి తలకు లోతైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. తలకు కుట్లు వేశాం. ముకేశ్ రాజ్‌పుత్ స్పృహ కోల్పోయిన స్థితిలో వచ్చారు. వైద్యం అందించాక ఆయన కోలుకుని స్పృహలోకి వచ్చారు' అని వైద్యులు వెల్లడించారు. వీరిని పలువురు కేంద్రమంత్రులు, తెదేపా ఎంపీ కలిశెట్టి

మొదటిపేజీ తరువాయి...

అప్పలనాయుడు తదితరులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో ఎంపీ ప్రతాప్ సారంగి మీడియాతో మాట్లాడుతూ.. 'నేను మెట్ల వద్ద నిల్చొని ఉండగా.. రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేశారు. ఆయన వచ్చి నాపై పడటంతో నేను కిందపడ్డాను' అని ఆరోపించారు. ఈ ఘటన నేపథ్యంలో రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని భాజపా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'జరిగిందంతా మీ కెమెరాల్లో కనబడి ఉండొచ్చు. నేను పార్లమెంట్ లోపలికి వెళ్తుండగా భాజపా ఎంపీలు నన్ను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. తోసేశారు. బెదిరించారు. మల్లికార్జున్ ఖర్గేను కూడా నెట్టేశారు. మాకు లోపలికి వెళ్లే హక్కు ఉంది. కానీ, వారు అడ్డుకుంటున్నారు. ఇక్కడ ప్రధాన సమస్య ఏంటంటే.. రాజ్యాంగంపై వారు దాడి చేస్తున్నారు. అంబేద్కర్‌ను అవమానించారు' అని రాహుల్ దుయ్యబట్టారు. భాజపా ఎంపీలే తమను అడ్డుకున్నారని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ 'ఎక్స్'లో షేర్ చేసింది. అంతేగాక, ప్రస్తుత వ్యవహారంపై స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ రాశారు. 'ఆందోళన సమయంలో భాజపా ఎంపీలు నన్ను నెట్టేశారు. దాంతో నా మోకాలికి గాయమైంది' అని తెలిపారు. తోపులాట ఘటనపై విచారణ జరపాలని లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామాల వేళ పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడ్డాయి.

## కాంగ్రెస్ వల్ల క్వశ్చన్ అవర్ అర్థమే మారిపోయింది

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, డిసెంబర్ 19 : కేబినెట్ నిర్ణయం అంటే సమిష్టి నిర్ణయమని, క్వశ్చన్ అవర్‌లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందన్నారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని నీటి సమస్యలను గురించి సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. దీనిపట్ల హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడటం ఏంటని, ఒక మంత్రి మరో మంత్రిని ప్రశ్నించడం ఏంటన్నారు. కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దని స్పీకర్‌ను కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారని, వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా మారిందన్నారు. అప్పుడు వారు సరిగ్గా చేసిఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. అయితే ఏ హెూదాలో అడుగుతున్నారని హరీశ్‌రావును మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఆయనకు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అతిఎక్కువ పాలించింది కాంగ్రెస్ పార్టీ. నేడు మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే నన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందే, తాము ఏం చేశామో చర్చ పెట్టాలన్నారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు సూటిగా జవాబు వచ్చినట్లయితే పది ప్రశ్నలకు ఆన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు.

## ఫార్ములా రేస్ పై చర్చ పెట్టండి

హైదరాబాద్, డిసెంబర్ 19, : ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు సీఎం కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. అయితే ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా తెలంగాణ శాసన సభ లో 4 కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి.తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్ములా–ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుంది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుంది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేసింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఫార్ములా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. నిజానికి ఫార్ములా–ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయి అని ఇదివరకే నేను వివరంగా చెప్పడం జరిగింది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉంది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదాం. శాసన సభ సెషన్ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి.మరోసారి చెబుతున్నాను. ఫార్ములా–ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయి. ' అని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ రాసిన లేఖలో ప్రస్తావించారు.

## రాజౌరీలో అంతుచిక్కని వ్యాధి .. 8 మంది మృతి




జమ్ము : జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో అంతుచిక్కని వ్యాధితో మరణించిన వారి సంఖ్య 8కి చేరింది. బుధవారం మరో చిన్నారి మరణించినట్లు అధికారులు తెలిపారు. మహమ్మద్ రఫీక్ పన్నెండేళ్ల కుమారుడు అష్పాక్ అహ్మద్ జమ్ములోని ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి (జిఎంసి)లో ఆరు రోజుల పాటు చికిత్స పొందుతూ మరణించాడని అన్నారు. మెరుగైన చికిత్స కోసం చండీగఢ్‌కు తరలించినా ఫలితం లేకపోయిందని అన్నారు. అష్పాక్ సోదరులు ఇష్టియాక్ (7), నాజియా (5)లు గత గురువారం మరణించిన సంగతి తెలిసిందే. అష్పాక్ మృతితో కోట్రంక తహసీల్‌లోని బాధాల్ గ్రామంలో మృతుల సంఖ్య 8కి చేరింది. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన రెండు కుటుంబాలవారని అన్నారు.రాజౌరీ డిప్యూటీ కమిషనర్ (డిసి) అభిషేక్ శర్మ సోమవారం బాధాల్ గ్రామంలోని కోట్రంకను సందర్శించారు. 14 ఏళ్లలోపు ఆరుగురు పిల్లలతో పాటు ఏడుగురు గుర్తుతెలియని అనారోగ్యంతో మరణించారు. మరణాలు, కేసుల దర్యాప్తు కోసం నిపుణుల బృందం ప్రభావిత బాధాల్ గ్రామానికి చేరుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేయడానికి, అనారోగ్యాన్ని గుర్తించడానికి బయోసేఫ్టీ లెవల్ (బిఎస్ఎల్–3) మొబైల్ లోబరేటరీని పంపినట్లు పేర్కొన్నాయి.

## మందమర్రి మండలంలో పులి సంచారం..

మొదటిపేజీ తరువాయి...

రామకృష్ణాపూర్ : మందమర్రి మండలంలో పులి సంచారం చేస్తుండటంతో మండల వాసులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల అందుగుల పేట గ్రామశివారులో రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం చేల వద్దకు వెళ్లగా పులి గాండ్రింపులు విని రైతులు భయపడి ఇంటికి తిరిగి వచ్చినట్లు సమాచారం. బుధవారం పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని సఫారీ రోడ్ మీద కెమెరాకు పులి చిత్రం ట్రాప్ అయిందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. పులి పాదముద్రలు సేకరణ కూడా జరిగిందని, అది ఆడ పులిగా గుర్తించినట్లు తెలిపారు. కాగా పులి అందుగుల పేట నుండి పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని బొక్కల గుట్ట, తిమ్మాపూర్, పాత మంచిర్యాల మీదగా ముల్కల్ల బీట్ ప్రాంతంలో సంచరిస్తుందని తెలిపారు. కావున ముల్కల్ల చుట్టుపక్కల ప్రజలు, మేకల కాపరులు, పశువుల కాపరులు అటు వైపు వెళ్లవద్దని, వ్యవసాయ క్షేత్రాల వద్ద ఎలాంటి కరెంట్ తీగలు అమర్చవద్దని హెచ్చరిస్తున్నారు.

## మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం..

మొదటిపేజీ తరువాయి...

'వారు మా మీద పన్నులు వేస్తే అంతే మొత్తంలో మేమూ వారిపై పన్నులు విధిస్తాం. మేము పన్నులు వేస్తే వారూ వేస్తారు. అన్ని సందర్భాలలోనూ వారు మాపై పన్నులు వేస్తున్నారు. మేమేమో వారిపై వేయడం లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలిపింది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత్, బ్రెజిల్ దేశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని అమెరికా వస్తువులపై ఈ రెండు దేశాలతో పాటు మరికొన్ని దేశాలు కూడా అధిక పన్నులు వసూలు చేస్తున్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ వంద శాతం పన్ను వేస్తే అమెరికా కూడా ప్రతిగా అంతే వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'భారత్ మాపై వంద శాతం పన్ను వేస్తే మేము ఏమీ వేయకూడదా? మీకు తెలుసు. వారు మాకు ఓ సైకిల్ పంపితే మేము కూడా సైకిల్ పంపుతాం' అని అన్నారు.

# రేపటి నుండి పాఠశాలల సమయం మార్పు

● జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19: ప్రస్తుతం నెలకొన్న వాతావరణం, విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఉపాధ్యాయ సంఘాల నాయకులు అందించిన ప్రాతినిధ్యం ప్రకారం ఈనెల 20వ తేది నుండి పాఠశాలల సమయంలో మార్పు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:15 గంటల వరకు కొనసాగుతున్న పాఠశాలల సమయం నూతన సమయం ప్రకారం ఉదయం 9:40 నిమిషాల నుండి సాయంత్రం 4:30 వరకు కొనసాగుతాయని తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, ప్రైవేట్ యాజమాన్యాలకు క్రింద నిర్వహిస్తున్న పాఠశాలలు నూతన సమయపాలన పాటించాలని, మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసి నూతన సమయాన్ని అమలు చేయాలని తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇదే సమయం కొనసాగుతుందని తెలిపారు.

## ప్రజా పాలనలో కళాకారులు పోషించిన పాత్ర అభినందనీయం

**తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి రాష్ట్ర చైర్ పర్సన్ డా. వెన్నెల**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19:** ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీలు, ప్రజా సంక్షేమ, రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం కాలం పూర్తయినందున నిర్వహించిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పోషించిన పాత్ర అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి రాష్ట్ర చైర్ పర్సన్ డా. వెన్నెల అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధి సభ్య కార్యదర్శి ఆదేశాల మేరకు హైదరాబాద్ లోని సారధి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో జిల్లా సాంస్కృతిక సారధి కళాకారులతో తె. సా. సా. రాష్ట్ర చైర్ పర్సన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో జిల్లా కళాకారులు కీలకమైన పాత్ర పోషించారని, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ కళాయాత్ర నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారని, కార్యక్రమం విజయవంతానికి కఅషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రజా ప్రయోజనకర పథకాల వివరాలను జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారులు కొప్పర్తి సురేందర్, గుడిసెల బాపు, కోదాది సోమశేఖర్, మరప పురుషోత్తం, కుమ్మరి శ్రావణ్ కుమార్,గుండ శిరీష, గొల్లపల్లి శిరీష లు పాల్గోన్నారు.

# సి,ఆర్,టి,లకు ఆర్థిక సహాయం చేసిన పీజీహెచ్‌ఎంలు




**జననినాదం,ఉట్నూర్ 19:** సి,ఆర్,టి,ల నిరవధిక సమ్మెకు మద్దతుగా టి ఎస్ టి డబ్ల్యూ టి యు,గిరిజన సంక్షేమ పీజీ హెచ్‌ఎం సంఘం సిఆర్టి లకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గత నాలుగు రోజులుగా ఉట్నూర్ ఐటిడీఏ ముందు చేస్తున్న నిరవధిక సమ్మె కు మద్దత్తుగా న్యాయమైన డిమాండ్లతో చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని టి,ఎస్,టి,డబ్ల్యూ,టి,యు,జిల్లా అధ్యక్షులు, పీజీహెచ్‌ఎం సంఘం జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్, పూర్క ఉద్దవ్ తెలిపారు. సి,ఆర్,టి,లకు భోజన ఖర్చుల కింద (పదివేలు రూపాయులు) ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని, సాధ్యమైనంత తొందరగా సిఆర్టి ల డిమాండ్లను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టి ఎస్ టి డబ్ల్యూ టి యు నాయకులు ప్రతి రోజు సి ఆర్ టి లు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాలకు వెళ్లి సంఘీ భావం తెలిపి కొంత ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. ఈ నిరవధిక సమ్మెలో టీఎస్ టి డబ్ల్యూ టి యు జిల్లా కార్యదర్శి మడవి గోపాల్, పీజీహెచ్‌ఎం సంఘం జిల్లా కార్యదర్శి నైతం కృష్ణరావ్, రాష్ట్ర నాయకులు జి అశోక్, కే. రవీందర్, టీఎస్ టి డబ్ల్యూ టి యు గౌరవ అధ్యక్షులు ప్రసాద్, సయుంక్త అధ్యక్షులు వెడ్మ యస్వంత్, కోశాధికారి కూడ్మేత అనంత్, ఉపాధ్యక్షులు మడావి పోచని తదితరులు పాల్గోన్నారు.

## అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి

- అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు సరికాదు
- కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి సుగుణక్క



**జననినాదం,ఆదిలాబాద్19:** భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి సుగుణక్క అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత, దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడైన అంబేద్కర్ ను అమిత్ షా అవమానించారని, పార్లమెంట్ లోనే ఆయనను,ఆయన రూపుదిద్దిన రాజ్యాంగాన్ని అవమానించడం దారుణమని రాజ్యాంగాన్ని అవమానపరిచిన అమిత్‌షావెంటనే రాజీనామా చేయాలనీ పేర్కొన్నారు. భారత్ లో అంబేద్కర్ పేరు ప్రస్తావించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తారని, కోట్లాది మంది భారత ప్రజల , అణగారిన వర్గాల ప్రజల ఆత్మగౌరవాలకు స్వచ్ఛ, సమానత్వా, హక్కులకు అంబేద్కర్ ప్రతీక అని సుగుణక్క వ్యాఖ్యానించారు."అంబేద్కర్.. అంబేద్కర్.. అంబేద్కర్.. మన హఅదయాలలో, మన పెదవులపై ఆనందంతో ఆయన నామాన్ని జపించుదాం" అని సుగుణక్క పిలుపునిచ్చారు.

# సంఘవిద్రోహ శక్తులకు దూరంగా ఉండండి

**జిల్లాలో మహిళల కోసం రెండు షీ టీంలు**

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు**

**ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు**




జననినాదం,బెజ్జూర్ 19: సంఘవిద్రోహ శక్తులకు యువత దూరంగా ఉండాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని నాగ పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గని ప్రసంగించారు. జిల్లాలో యువత పెడదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం రెండు షీ టీంలుపని చేస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.బెజ్జూర్ మండలంలోని మారుమూల మొగవెల్లి నుంచి గూడెం రోడ్డుమరమత్తులు పోలీస్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఏ ఒక్కరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని తెలిపారు. అనంతరం నాగ పెల్లి గ్రామంలో 100 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోలీస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ డీఎస్పీ రామానుజన్, కౌటాల సీఐ ముత్యం రమేష్, బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ తదితరులు పాల్గన్నారు.

# అమ్మవారి గుడి అభివృద్ధిని వేగవంతం చేయండి

- అగ్రికల్చర్ కళాశాలను ఏర్పాటు చేయాలి
- 190 చెరువుల మరమ్మత్తులకు నిధులు కావాలి
- 150 పడకల ఆసుపత్రిగా అప్ గ్రెడ్ చేయాలి
- ఎమ్మెల్యే రామారావు పటేల్



జననినాదం,భైంసా 19: దేశంలోనే ప్రసిద్ధి గాంచిన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ముథోల్ తాలూకాలో నెలకొని ఉండగా, అమ్మవారి అభివృద్ధిని వేగవంతం చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రస్తావించారు. గతంలో 50 కోట్లు మంజూరై వెనక్కి వెళ్ళగా, ప్రస్తుతం రూ.42 కోట్లు మంజూరయ్యాయని, అభివృద్ధి ప్రారంభించి రాబోయే 2027 సంవత్సరం పుష్కరాలలోపు పూర్తి చేయాలన్నారు. దాతల రూపంలో పలువురు ఐదు కోట్ల వరకి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఉన్న నియోజకవర్గంలో 60 ఎకరాల భూమి అందుబాటులో ఉందని దీంట్లో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అగ్రికల్చర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. 6000 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా బ్రహ్మేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ను 80 కోట్ల రూపాయలతో నిర్మిస్తే, గత పాలకుల నిర్లక్ష్యంతో ట్రాన్స్ఫార్మర్లు, పరికరాలు దొంగలు దోచుకెళ్లారని, సాగునీరు అందక ఆ ప్రాంత రైతులు వెనుకబడుతున్నారనీ, తక్షణమే వీటికి నిధులు ఇవ్వాలని కోరారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు లక్ష్యం 14,000 ఎకరాలకు సాగునీరు కాగా, సీసీ లైనింగ్ పూర్తి చేయకపోవడంతో కేవలం 5000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని, రూ.50 కోట్ల నిధులు ఇచ్చి, సీసీ లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి 28వ ప్యాకేజీ కోసం నిధులు ఇచ్చారని, 50,000 ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ ప్యాకేజీ పనులు పది సంవత్సరాల కాలంలో ఏమాత్రం ప్రగతికి నోచుకోలేదన్నారు. తాలూకా వ్యాప్తంగా 310 చెరువులు కాగా, 120 చెరువులకు మిషన్ కాకతీయ ద్వారా బాగు చేశారని, మరో 190 చెరువుల మరమ్మత్తులకు నిధులు ఇవ్వాల్సిందిగా కోరారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ద్వారా గుండె గాం వాసులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఇకనైనా తక్షణ పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారని, తక్షణమే సంబంధిత శాఖ మంత్రి జీవో జారీ చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బైంసా ఏరియా ఆసుపత్రికి 100 పడకల నుంచి 150 పడకల ఆసుపత్రిగా అప్ గ్రెడ్ చేయాలని కోరారు. సంబంధిత శాఖ మంత్రులు సానుకూలంగా స్పందించారు.

# విధుల పట్లా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**గిరిజన సంక్షేమ శాఖా ఉప సంచాలకులు ఆర్.రమాదేవి**

**ప్రాథమిక పాఠశాలలోఅన్ని రికార్డులు సక్రమంగా ఉంచాలి**

**పి,ఎం,ఆర్,సి,ఏ,సి,ఎం ఓ పూర్క ఉద్దవ్**



**జననినాదం,ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి19:** కుంరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం పి ఎం ఆర్ సి లో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్ సి ఆర్ పి ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆసిఫాబాద్ ఏ టి డబ్ల్యూ ఓ చిరంజీవి, కాగజనగర్ ఏ టి డి ఓ ఖుర్మ్ హుసేన్ జైనూర్ ఏ టి డి ఓ శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సీ ఆర్ పి లు పాల్గన్నారు. పి ఎమ్ ఆర్ సి ఏ సీఎం పూర్కా ఉద్దవ్, గిరిజన సంక్షేమ శాఖా ఉప సంచాలకులు ఆర్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతు గిరిజన విద్యార్థుల విద్యా వికాసానికి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కచ్చితంగా పాఠశాల సమయానుగుణంగా వెళ్లి విద్యనందించాలని సూచించారు. కఅత్యధార భోదన పద్ధతి ద్వారా విద్యా ను అందించాలని, ఉపాధ్యాయులు తప్పగా డైరీ ఉపయోగించాలని, స్కూల్ గ్రాంట్ విషయం లో అందరు పాఠశాలకు వచ్చిన నిధులను పాఠశాలకు ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని, స్కూల్ యూనిఫామ్ తొందరగా విద్యార్థులకు అందించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం మేనో ప్రకారం అందించాలని, పాఠశాల ఆవరణం ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాల్సిన భాధ్యత ఉపాధ్యాయులుదేనని పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆదేశానుసారం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా కచ్చితంగా పాఠశాలలో పనులు నాణ్యమైనది గా చేయించుకోవాలని, విద్యార్థులకు కనీస ఇంగ్లీష్ సామర్థ్యాలు వచ్చే విధంగా కఅషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో 15 స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎస్ సి ఆర్ పి లు, ఏ టి డి వో లు పాల్గన్నారు.

# అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**గ్రామాల్లో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం**

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా**



జననినాదం,ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి19:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించి అర్హులను గుర్తించి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. గురువారం జిల్లాలోని భీంపూర్ మండలంలో పర్యటించిన ఆయన పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఇందులో భాగంగా ఇంద్రవేల్లి గ్రామస్తులకు చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్ లను పంపిణీ చేశారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వారు చలి తీవ్రత కు స్పందించి ఇందూర్ గ్రామ ప్రజలకు రగ్గులు స్వెటర్లు, మప్లర్లు పంపిణీ చేసినందుకు వారిని అభినందించారు. అంతకుముందు ఇంద్రవేల్లి గ్రామానికి వెళ్లిన కలెక్టర్ కు గ్రామస్తులు సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉందని, ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలులతో చలి తీవ్రత పెరిగిందని, అల్పపీడన ద్రోణి తీరం దాటడం తో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. కొద్దిరోజుల పాటు చలి తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిందని అన్నారు. దట్టంగా కమ్మేసే పొగమంచు, అతి శీతల పవనాల నేపథ్యంలో వఅద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని, శీతాకాలం లో వచ్చే అనారోగ్య సమస్యల నుండి రక్షించుకోవాలని గ్రామస్తులను కోరారు. ఇందులో భాగంగా మండలం అరిటికి వెళ్లిన కలెక్టర్ గ్రామస్తులు మంచి అలవాట్లను అలవర్చుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పొగాకు, తంబాకు, గుట్కా లాంటివి తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, అందుకు గ్రామం లో ఉన్న సమస్యల పై ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ ను ఆదేశించారు. ఇందులో జిల్లా వైద్యాధికారి నరేందర్,ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సమీయుద్దీన్, మాజీ జడ్పీటీసీ సుధాకర్, మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్ నలంద ప్రియ, ఎంపీడీఓ, గ్రామ పటేల్ దాదా రావు,తదితరులు పాల్గన్నారు.

## వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయండి

**డీఎఫ్ వో నీరజ్ కుమార్**



జననినాదం,వాంకిడి19:వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా ఏకో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డీఎఫ్ వో నీరజ్ కుమార్‌నేషనల్ హైవే అధికారులను కోరారు. గురువారంమండలంలోని గోయగాం గ్రామ శివారులో నిర్మించిన ఏకో బ్రిడ్జిని నేషనల్ హైవే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఏకో బ్రిడ్జి పై నిర్మాణానికి అనుగుణంగా ఎత్తు లేకపోవడంతో వన్యప్రాణుల రాకపోకలకు అనువుగా లేదని, ఏకో బ్రిడ్జి పై నిర్మాణానికి సమానంగా గుంతలు లేకుండా పనులు తొందరగా పూర్తి చేయాలని నేషనల్ హైవేఅధికారులను ఆయన కోరారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం

**గల్ఫ్ సంక్షేమ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న**



జననినాదం,జన్నారం 19: గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వలసదారుల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిఅమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గల్ఫ్ సంక్షేమ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల చిరకాల వాంఛ గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడంలో విఫలమైందని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 216 జీఓ విడుదల చేసి డిసెంబర్ 2023 తర్వాత గల్ఫ్ లో చనిపోయిన కొందరు గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందజేసినప్పటికి పూర్తిగా న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ వలసదారుల కష్టాలను గుర్తించి పక్క రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలు ఇక్కడ కూడా తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంచార్జ్ ఎరుకల రాజు గౌడ్, రాష్ట్ర కోశాధికారి అమర కొండ మల్లేష్, దుబాయ్ శాఖ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్, బార్ దుబాయ్ కోఆర్డినేటర్ కూనారపు రమేష్ ధర్మాజీ సత్తెన సురేష్ వినోద్ తదితరులు పాల్గోన్నారు.

## మందమరి మండలంలో పులి సంచారం

**ఆందోళనలో స్థానికులు**



జననినాదం,రామకృష్ణాపూర్19: మందమర్రి మండలంలో పులి సంచారం చేస్తుండటంతో మండల వాసులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల అందుగుల పేట గ్రామశివారులో రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం చేల వద్దకు వెళ్లగా పులి గాండ్రింపులు విని రైతులు భయపడి ఇంటికి తిరిగి వచ్చినట్లు సమాచారం. బుధవారం పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని సఫారీ రోడ్ మీద కెమెరాకు పులి చిత్రం ట్రాప్ అయిందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. పులి పాదముద్రలు సేకరణ కూడా జరిగిందని, అది ఆడ పులిగా గుర్తించినట్లు తెలిపారు. కాగా పులి అందుగుల పేట నుండి పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని బక్కల గుట్ట, తిమ్మాపూర్, పాత మంచిర్యాల మీదగా ముల్కల్ల బీట్ ప్రాంతంలో సంచరిస్తుందని తెలిపారు. కావున ముల్కల్ల చుట్టుపక్కల ప్రజలు, మేకల కాపరులు, పశువుల కాపరులు అటు వైపు వెళ్లవద్దని, వ్యవసాయ క్షేత్రాల వద్ద ఎలాంటి కరెంట్ తీగలు అమర్చవద్దని హెచ్చరిస్తున్నారు.

## రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం



జననినాదం,ఆదిలాబాద్‌జిల్లా ప్రతినిధి19: రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు భారతీయ జనతా పార్టీ తరఫున పోరాటం చేస్తామని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా భాజపా ఎమ్మెల్యేలు పాయల శంకర్ రామారావు పటేల్, రాకేష్ .హరీష్ బాబు. తదితరులు ఎడ్ల బండి పై అసెంబ్లీకి వెళ్లారు ఈ సందర్భంగా పాయల శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన రైతుల సమస్యలను పరిష్కరించలేక పోయిందని ఆయన అన్నారు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చ జరగాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు పంట బీమా రైతు భరోసా పథకాల అమలుకు నోచుకోలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని ఆయన అన్నారు.

## పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలి

**నేరస్తులకు శిక్షలు పడటంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన**

**పిపి లకు, కోర్టు డ్యూటీ అధికారులకు సత్కారం**

**– జిల్లా ఎస్పీ గౌష్ ఆలం .**



జననినాదం,ఆదిలాబాద్‌జిల్లా ప్రతినిధి19: జిల్లా నందు అన్ని పోలీస్ స్టేషన్లో వారిగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసుల ను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఈరోజు స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా పోలీసు అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరంలో కాలంలో పెండింగ్లో ఉన్న పూర్తికి కేసులను విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా కోర్టులనందు చార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా నందు నేరాల అదుపునకు నూతన పోలీసు సిబ్బందిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ పెట్రోలింగ్, గస్తీ, రాత్రి సమయాలలో బీట్ పద్ధతిని ఉపయోగిస్తూ, బ్లూ కోర్ట్, డయల్ హండ్రెడ్ సిబ్బందిని వినియోగిస్తూ ఆర్థిక నేరాలను కట్టడి చేయాలని సూచించారు. ముఖ్యంగా పెండింగ్లో ఉన్న ఎస్సీ ఎస్టీ, గంజాయి, పోక్సో, గ్రేవ్, నాన్గ్రేవ్, మహిళల పట్ల జరుగు నేరాల పై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోర్టు డ్యూటీ అధికారులతో ప్రతి శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేసి కోర్టుల నందు జరిగే విచారణ పద్ధతిని,కేసుల ప్రస్తుత స్థితిగతులను పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి సమయాలలో గస్తీ నిర్వహిస్తున్న సమయం లో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించి ఫింగర్‌ప్రింట్ యంత్రాల ద్వారా పరిశీలించాలని సూచించారు. గ్రామాల వారిగా మాదకద్రవ్యాల పై అవగాహన కల్పిస్తూ రైతులను గంజాయి దళారులు చేసే మోసాలపై వివరించాలని యువతకు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై చైతన్యపరచాలని సూచించారు. మత్తు పదార్థాలు బారిన పడకుండా పట్టణాలలో కళాశాలల నందు విద్య ప్రాంగణాల నందు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను మత్తు పదార్థాలు బారిన పడకుండా చూడాలన్నారు. ఈ నెల నందు జిల్లాలో సంభవించిన మూడు కేసుల నందు నేరస్తులకు జీవితకాల శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన పిపిలు సంజయ్ వైరాగరి మరియు మేకల మధుకర్ లను జిల్లా ఎస్పీ స్వయంగా అధికారుల సమక్షంలో శాలువాతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. అదేవిధంగా ఈ కేసుల నందు సాక్షులను ప్రవేశపెట్టడంలో ప్రతిభ కనబరిచిన కోర్టు లైసన్ అధికారి ఎం గంగాసింగ్, కోర్టు డ్యూటీ అధికారులు ఎంఏ జమీర్ మరియు రవీందర్ లను శాలువాతో సత్కరించి నగదు బహుమతి ప్రధానం చేసి అభినందించారు. కోర్టు డ్యూటీ అధికారులు తమకు కేటాయించిన విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు రివార్డులను అందిస్తూ ప్రోత్సహిస్తామని తెలియజేశారు. తదుపరి సి ఈ ఐ ఆర్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పలు సందర్భాలలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల కు 28 మొబైల్ ఫోన్ లను తిరిగి అందజేయడం జరిగింది. మొబైల్ ఫోన్లను అందుకున్న వారు పోలీస్ స్టేషన్ ల వారిగా ఇచ్చోడ -8, నేరడిగొండ -7, ఆదిలాబాద్ వన్ టౌన్ 2,మావలా-4, ఆదిలాబాద్ రూరల్ -1, ఇంద్రవెల్లి 3, ఉట్నూర్ 2. జిల్లాలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులు తదితర అంశాలపై జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, డిసిఆర్బి, ఫింగర్ ప్రింట్, ఐటీ సెల్, సైబర్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గన్నారు.

## జిల్లాలో విస్తృతంగా టీఎన్జీవో సభ్యత్వ నమోదు



**జననినాదం,మంచిర్యాల,19:** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లాలోని కమర్షియల్ టాక్స్ కార్యాలయం,ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులందరూ టీఎన్జీవో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు,మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్,జిల్లా కార్యవర్గ సభ్యులు యూనిట్ సభ్యులు ఉద్యోగస్తులు తదితరులు పాల్గన్నారు.

## పేకాట స్థావరంపైదాడి..ముగ్గిరి అరెస్ట్

**రూ. 7,650 నగదు స్వాధీనం**



జననినాదం,కాసిపేట 19:మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల వరిపేట గ్రామ శివారులో చెట్ల పొదలలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులు రెడ్ హ్యాండెడ్ గా దొరకగా ఐదుగురు పరారయ్యారు. ఘటనా స్థలంలో రూ. 7,650 నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఎస్సై లచ్చన్న టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి, వరిపేట శివారులోని చెట్ల పొదలలో పేకాట స్థావరంపై దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఆకస్మికంగా దాడి చేయగా సోమగూడెం చెందిన కనుకుల తిరుపతి, బుచ్చ గూడెం చెందిన నవనందుల వెంకటేష్, తంగళ్ళపల్లి చెందిన అక్కనపల్లి లక్ష్మి పతి పట్టుబడ్డారు. పోలీసుల రాకను గమనించిన గుండ్ల సంతోష్, పత్తిపాక ప్రవీణ్, ఎదుల తిరుపతి, గుండా రాజేందర్, సాయి ఫరర్ అయ్యారు. విచారణ నిమిత్తం అరెస్ట్ అయిన నిందితులను కాసిపేట పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## ఇందిరమ్మ మహిళా శక్తి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి. వసీమ్**

**మైనారిటీలు కుట్టు మిషన్ల దరఖాస్తు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం.**

**ఆన్ లైన్ గడువు ఈ నెల 31 వరకు.**

జగిత్యాల,: తెలంగాణ రాష్ట్రం లోని మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం ప్రవేశ పెట్టిందని,దానిలో భాగంగా రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్లను జిల్లాలోని మైనార్టీ మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ఆన్ లైన్ గడువు ఈ నెల 31 వరకు చివరి తేదీ అనిమైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలనికాంగ్రెస్ పార్టీ మైనార్టీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.వసీమ్ కొరారు.ఈ పథకానికి ధరఖాస్తు చేసుకోవాలంటే 18- 55 సంవత్సరాల వయస్సు కలిగి, ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి కార్డుతో పాటు కనీస విద్యార్హత 5వ తరగతి కలిగి ఉండాలన్నారు. తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలని, ఇవి రెండూ లేని వారు గ్రామీణ ప్రాంతాలలోని వారైతే రూ. 1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో రూ. 2 లక్షల లోపు ఆదాయ ధృవీకరణ పత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి పొంది ఉండాలన్నారు. అదే విధంగా గుర్తింపు పొందిన శిక్షణా సంస్థలు, లేదా తెలంగాణ మైనారిటి ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా టైలరింగ్ కోర్సులో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యత నివ్వబడుతుందని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు తమ పాస్ పోర్టు ఫోటోతో డిసెంబర్ 31 లోపు బిఐసీఎఎఎబ.ఐనీల.తిని అనే వెబ్సైట్ లో తమ వివరాలను ఏదైనా నెట్ సెంటర్ లేదా ఎండ్రైడ్ మొబైల్ లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్ లైన్ ప్రక్రియ అనంతరం హార్డ్ కాపీలను డౌన్లోడ్ చేసుకొని సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరచి నవ భారత్ ఏరియా లోని జిల్లా కలెక్టరేట్ నందు గల మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం లో అందించాలన్నారు. ఈ అవకాశాన్ని మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్సీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేద మైనార్టీ మహిళలకు, విడాకులు పొందిన వారికి, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాధలకు తొలి ప్రాధాన్యత కల్పించబడుతుందన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలపై టీజేఎస్ నిరసన..

**స్టేట్ ఆఫీస్ వద్ద దిష్టిబొమ్మ దహనం**

హైదరాబాద్, డిసెంబర్ 19,:పార్లమెంట్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా గురువారం తెలంగాణ జనసమితి పార్టీ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫీస్ వద్ద పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు ఎం. నర్సయ్య మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ శిల్పి మాత్రమే కాకుండా, దేశ సమానత్వ స్ఫూర్తికి ప్రతీక అని అన్నారు. దేశ ప్రజలు ఎప్పటికీ ఆయన సేవలను గౌరవంతో స్మరించుకుంటారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అగ్రకుల దురహంకారాన్ని ప్రదర్శిస్తూ, సబ్బండ వర్గాలను అవమానించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. వెంటనే అమిత్ షా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆయనను హోం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోడీని డిమాండ్ చేశారు.టీజేఎస్ నాయకుడు సర్దార్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను



దెబ్బతీశాయన్నారు. ఇది రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమన్నారు. వెంటనే ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.జె.ఎస్ నాయకులు బట్టల రాంచందర్, మనేపల్లి లక్ష్మణ్, పుష్పానీల గౌడ్, జైపాల్ రెడ్డి, హన్మంతు గౌడ్, రంజిత్ కుమార్, మాణిక్యం, భాస్కర్, భూషణ్, సురేష్ కుమార్, సయ్యద్ అబ్రార్, కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**♦ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**



**జననినాదం,నిజామాబాద్,19:** ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలో, వడ్యాట్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ గురువారం పరిశీలించారు. సర్వేయర్లు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించారు. మొబైల్ యాప్ లో నమోదు చేసిన వివరాలు దరఖాస్తుదారుల వాస్తవ వివరాలతో సరిపోయాయా లేదా అన్నది గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, దరఖాస్తుదారుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి సమాచారాన్ని సేకరించి మొబైల్ యాప్ లో పొందుపరచాలని తెలిపారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫొటోతో పాటు వారి ఫొటోను, స్వంత ఇల్లు అయితే నిర్ధారిత డాక్యుమెంట్లు కానీ, ఇంటి పన్ను చెల్లించిన రసీదు లను యాప్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. సొంత ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తుదారు చూపిన నివేశన స్థలం, దాని డాక్యుమెంట్లను యాప్ లో పొందుపర్చాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ఈ నెలాఖరులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

### జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

మోర్తాడ్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. డైట్ చార్జీలను 40శాతం వరకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవలే అమలులోకి తెచ్చిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, అందుబాటులో ఉంచిన ఔషధాలు, వాటి కాలపరిమితిని తనిఖీ చేశారు. ఇదివరకు ఆరోగ్య పరీక్షలు జరిపిన విద్యార్థులకు కూడా మళ్లీ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ నిర్వహించాలని అన్నారు. అనంతరం పదవ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులను పలకరించారు. పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని అంచనా వేశారు. చక్కగా చదువుకుని వఅద్ధిలోకి రావాలని మార్గనిర్దేశం చేశారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందిస్తూ, మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా అంకిత భావంతో కఅషి చేయాలని పాఠశాల నిర్వాహకులను కలెక్టర్ ఉద్బోధించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, ఎంపీడీవో తిరుమల, తహసిల్దార్ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సిఆర్టీల డిమాండ్లను పరిష్కరించాలి

**విద్యార్థుల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం**

**ఏకోపాధ్యాయ పాఠశాలలు తెరుచుకోవడం లేదు**

**ఆదివాసి సేన కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కోట్నక గణపతి**

**జననినాదం,తిర్యాణి 19:** ఉట్నూర్ ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సిఆర్టీలు తమ సమస్యలు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారించాలని ఆదివాసి సేన కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కోట్నక గణపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నేల 16వ తేదీ నుంచి చేస్తున్న సిఆర్టీల సమ్మె చేస్తున్న కారణంగా పాఠశాలలు మూత పడడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం చూపుతుందనీ సిఆర్టీలు సమ్మెకు దిగడంతో ఐటిడిఎ పరిధిలోని ఏకోపాధ్యాయ పాఠశాలలు తెరుచుకోవడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 123 ఆశ్రమ పాఠశాలు 904 గిరిజన ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 1200 మంది సిఆర్టీలు సమ్మెకు దిగడంతో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ కుంటుపడిందని ఆయన అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సిఆర్టీల న్యాయమైన డిమాండ్ల



పరిష్కారం చూపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి సేన తిర్యాణి మండల అధ్యక్షులు మడవి వేంకట్ రావు, మండల కార్యదర్శి పర్చకి జంగు తదితరులు పాల్గన్నారు

# 20 వేల కోట్లు దాటేసిన మద్యం ఆదాయం



హైదరాబాద్, డిసెంబర్ 19: తెలంగాణలో మద్యం విక్రయాలతో ప్రభుత్వ ఖజానాకు 8 నెలల్లో రూ.20,903.13 కోట్ల ఆదాయం సమకూరినట్లు అబ్కారీ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాలపై రెవెన్యూ రూపేణా రూ.10,285.58 కోట్లు విలువ ఆధారిత పన్ను రూపంలో రూ.10,607.55 కోట్లు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అసెంబ్లీలో ప్రకటించింది.తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు కేపీ వివేకానంద, హరీశ్ రావు, కౌశిక్ రెడ్డి, అనిల్ జాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు అబ్కారీ శాఖ సమాధానం ఇచ్చింది. బెల్టు షాపులు ఎన్ని ఉన్నాయని సభ్యులు అడిగిన ప్రశ్నకు.. రాష్ట్రంలో బెల్ట్ షాపులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.అక్రమ మద్యం విక్రయాలను కట్టడి చేస్తున్నామని, ఎక్సైజ్ చట్టాల ప్రకారం ఎప్పటికప్పుడు అనధికారిక మద్యం విక్రయాలపై కేసులు నమోదు చేస్తున్నామని సభలో ప్రకటించింది. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు నాటికి అనధికారిక విక్రయాలపై 6,915 కేసులు నమోదు చేశామని వివరించారు. ఈ కేసుల్లో 6,728 మందిని అరెస్ట చేయడంతో పాటు 74,425 లీటర్ల మద్యం353 వాహనాలను జప్తు చేసినట్లు వెల్లడించారు. మద్యపాన దుష్ప్రభావాలు, మత్తు పదార్థాల దుర్వినియోగంపై తెలంగాణలో 735 అవగాహన సదస్సులు నిర్వహించారు.2023-24 ఆర్థిక సంవత్సరంలో మద్యం విక్రయాలతో ఏపీలో ఎక్సైజ్ శాఖకు దాదాపు 36వేల కోట్ల రుపాయల ఆదాయం సమకూరింది. అన్ని రకాల ఖర్చులు మినహాయించగా దాదాపు రూ.30వేల కోట్లకు పైగా ఆదాయం ప్రభుత్వానికి లభించింది. 2019-24 మధ్య ఏపీలో మద్యం ధరల్ని గణనీయంగా పెంచడంతో పాటు ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలను నిర్వహించడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభించింది.అక్టోబర్ 16 నుంచి ఏపీలో ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభం అయ్యాయి. అక్టోబర్ 16 నుంచి డిసెంబర్ 9 వరకు రూ.4,677 కోట్ల వ్యాపారం జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. 55 రోజుల వ్యవధిలో 61.63 లక్షల కేసుల లిక్కర్, 19.33 లక్షల కేసుల బీర్లు విక్రయించినట్టు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. వైసీపీ హయాంలో ప్రభుత్వమే స్వయంగా మద్యం షాపులు నిర్వహించింది. అయితే కూటమి సర్కార్ ఆ విధానానికి స్వస్తి పలికింది. రెండేళ్ల పాటు అమల్లో ఉండే కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం...ప్రైవేట్ లిక్కర్ షాపులకు టెండర్లు పిలిచి 3,300 లిక్కర్ షాపులు ఏర్పాటు చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా 3,300 లిక్కర్ దుకాణాల టెండర్ల రూపంలో ప్రభుత్వానికి దాదాపు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరింది. అక్టోబర్ 16వ తేదీ నుంచి నూతన మద్యం షాపులు ప్రారంభం అయ్యాయి. అయితే నిబంధనల ప్రకారం షాపులు పాడుకున్న యజమానులకు 20 శాతం కమిషన్ ఇవ్వాలి. అయితే ఇంకా పాత మద్యవే విక్రయిస్తున్నట్లు చెబుతున్న ఎక్సైజ్ శాఖ...కమిషన్ తక్కువగా ఇస్తుంది. ఇప్పటికైనా 20 శాతం కమిషన్ ఇవ్వాలని మద్యం షాపుల యజమానుల నుంచి ఒత్తిడి వస్తుంది.20 శాతం కమిషన్ ఇవ్వకుంటే నష్టాలు వస్తాయని మద్యం దుకాణాలు యజమానులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, బార్లలో కలిపి అక్టోబర్ 16వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు రూ.4,677 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. రానున్న రోజుల్లో లిక్కర్ సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉంది. క్రిస్టమస్, సంక్రాంతి సీజన్ కావడంచో లిక్కర్ సేల్స్ మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

## తిరుమలలో భక్తులకు మధ్య వ్యత్యాసం మంచిది కాదు : శ్రీనివాస్‌గౌడ్



తిరుమలడిసెంబర్ 19 : తిరుమలకు వచ్చే భక్తుల మధ్య వ్యత్యాసం చూపిస్తే అది మంచి పద్ధతి కాదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం శ్రీనివాస్‌గౌడ్ తిరుమలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో అవలంభిస్తున్న వైఖరిని తప్పుబట్టారు. దర్శనాలు, గదుల కేటాయింపులో తెలంగాణ భక్తులను నిర్లక్ష్యం చేస్తుందని ధ్వజమెత్తారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఏకైక అనుసంధానం తిరుమలేనని పేర్కొన్నారు. గడచిన పది సంవత్సరాల తరువాత ఇరురాష్ట్రాల ప్రజలను టీటీడీ సమానంగా చూడడం లేదని ఆరోపించారు. తిరుమలలో సామాన్యులకు, రాజకీయ నాయకులకు, వీఐపీలకు ఇచ్చే గౌరవంలో చాలా వ్యత్యసం కనబడుతుందని విమర్శించారు. అనుభవం ఉన్న చంద్రబాబు వీటిని గుర్తించి సరిచేయవలిసి అవసరం ఉందని సూచించారు. తెలంగాణలో ఎక్కువగా లబ్దిపొందింది ఆంధ్రవారేనని, కాంట్రాక్టర్లు, బిల్డర్లు వాళ్లే ఉన్నారని, ఆర్థికంగా బలపడ్డవారిలో ఆంధ్రవారే ఎక్కువగా ఉన్నారని వెల్లడించారు.

# సంక్రాంతి నుంచి మరో రెండు హామీలు



నిజామాబాద్, డిసెంబర్ 19,: సంక్రాంతి వస్తోంది. సంబరాలు తెస్తోంది. ఎటు చూసినా గ్రామాలు సందడి సందడిగా కనిపిస్తాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందమయ క్షణాల్లో ఉంటారు. అటువంటి సంక్రాంతి సంబరాలకు తెలంగాణ సర్కార్ సరికొత్త పథకాలతో సందడి చేయనుంది. సంక్రాంతి అంటేనే సందడి.. సంబరం.. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, పేదల కుటుంబాల్లో కూడా ఆ సంబరాన్ని తెచ్చేందుకు పెద్ద ప్లాన్ వేశారు.తెలంగాణ సర్కార్ ఏడాది పాలనలో ఏం చేసిందంటే.. చాలానే చేసిందంటున్నారు ప్రజలు. అందుకు ఉదాహరణే మొన్న జరిగిన ప్రజా విజయోత్సవాలు. ఏడాది కాలంలో మహిళలకు ఫ్రీ బస్, సుమారు 55 వేల ఉద్యోగాలు, రుణమాఫీ, గృహ జ్యోతి, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, గురుకులం విద్యార్థులకు మెనూ మార్పు, మూసీ ప్రక్షాళన, ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, సింగరేణి కార్మికులకు బోనస్ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారు.సంక్రాంతికి తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా వినూత్న పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అందులో ప్రధానంగా భూమి లేని పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు సీఎం రేవంత్ సర్కార్, దేశంలో ఎక్కడా లేని విధంగా సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. భూమి ఉంటే సాగుతో ఆదాయం అందుతుంది. అదే లేని వారి పరిస్థితి ఎట్లా అంటూ ఆలోచించిన ప్రభుత్వం, వారికి ఏడాదికి రూ. 12 వేలు అందించేందుకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 28న ఈ పథకానికి తొలి ఆడగు పడనుంది.అలాగే ఏ పథకం వర్తించాలన్నా రేషన్ కార్డు అవసరం. అర్హత ఉండి రేషన్ కార్డు లేని ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ఇటువంటి వారికి మాత్రం రేషన్ కార్డు లేదన్నది వాస్తవం. అందుకే సంక్రాంతి పండుగ తర్వాత సుమారు 30 లక్షలకు పైగానే రేషన్ కార్డులను ప్రభుత్వం అందించనుంది. దీనితో ఎన్నో పేద కుటుంబాలకు మేలు జరగనుంది. ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ద్వారా, రేషన్ కార్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్న వారి పరిస్థితి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.అంతేకాదు సంక్రాంతి అంటేనే పాడిపంటల పండుగని కూడా చెబుతారు. అటువంటి పండుగకు రైతన్నలలో చిరునవ్వులు చిందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఏడాదిలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, రైతు బంధు కూడా విడుదల చేయడం రైతన్నలకు అసలు సంక్రాంతి అంటే ఇదే అనే తరహాలో పథకం వరంగా మారనుంది.ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మాటలు కాదు పాలన చేతల్లో చూపిస్తామంటూ ప్రకటించారు. గత పాలకులు దోచుకున్నారు.. దాచుకున్నారు. కానీ ఇందిరమ్మ రాజ్యంలో వాటికి చోటు లేదు. ప్రజా సంక్షేమమే మా ధ్యేయమంటూ సీఎం చెప్పారు. సేమ్ టు సేమ్ అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా పాలనకు కట్టుబడి సంక్రాంతికి వరాల జల్లు కురిపిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బోయపల్లి లో ఘనంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం



జననినాదం,తాండూర్ : తాండూరు మండలం బోయపల్లి గ్రామం హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవ కార్యక్రమాన్ని గురుస్వామి సూర్య భాస్కర్ శర్మ ,సాయి కిరణ్ శర్మ మంత్రోచరణలతో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు .గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు గ్రామస్తుల సహకారంతో సామూహికంగా మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు .వినాయక, సుబ్రహ్మణ్యం ,అయ్యప్ప స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామియే శరణం అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణంతో ఆ ప్రాంగణమంతా శరణు ఘోష తో మార్మోయింది .భక్తి పాటలతో భజన బృందం సభ్యులతో అయ్యప్ప స్వాములు పేట తుళ్ళి నృత్యాలతో పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది .గ్రామానికి చెందిన గురు స్వామి పిడుగు సత్యనారాయణ శిష్య బృందం తో పాటు గ్రామస్తులు సహకారంతో అయ్యప్ప పడిపూజ మహోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరగగా ఈ పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన అయ్యప్ప స్వామి దీక్ష స్వాములతో పాటు భక్తులకు పూజా కార్యక్రమం అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలతోపాటు అల్పాహారం కూడా అందించారు.

## పెద్దాపూర్ గురుకులంలో మరో విద్యార్థికి అస్వస్థత..



కోరుట్ల : పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థులు పాముకాటుకు గురవడం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అయితే ఆ ఘటనలు మరవక ముందే అదే పాఠశాలలో బుధవారం ఎనిమిదో తరగతి చదువుతున్న మరో విద్యార్థి అస్వస్థతకు గురి కావడంతో కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో యాంటీ వీనామ్ ఇంజక్షన్ ఇచ్చి వైద్యం అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న డీఎంహెచ్వో కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్ లు బుధవారం ఆస్పత్రిలో ఉన్న అఖిల్ అనే విద్యార్థి ఆరోగ్యం పై ఆరాతీసి ఎలాంటి అపాయం లేదని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు మాత్రం అది పాము కాటే అని ఆరోపించారు. కాగా తాజాగా గురువారం ఎనిమిదో తరగతి చదువుతున్న మరో విద్యార్థి బోడ యశ్వంత్ అస్వస్థతకు గురికావడంతో అలర్ట్ అయిన పాఠశాల సిబ్బంది కోరుట్లలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యశ్వంత్ ఆరోగ్యం నిలకడగా ఉండగా చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. తాజాగా గురువారం అస్వస్థతకు గురైన విద్యార్థి యశ్వంత్ పాము కాటుకు గురయ్యాడ లేదా ఏదైనా విషకీటకమా, మరేదైనా జరిగిందా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మౌలిక వసతులు తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

## ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆగ్రహం



జననినాదం,తాండూర్ : తాండూర్ మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల మరియు కళాశాల యొక్క మౌలిక వసతులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో స్థానిక ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు . విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బోధించే ఉపాధ్యాయులతో పాటు ప్రిన్సిపాల్ ఎల్లవేళలా స్థానికంగా అందుబాటులో ఉండాలన్నారు .జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పాఠశాలలో అందుబాటులో ఉన్న గదుల సంఖ్య, మరుగుదొడ్లు స్నానపుగదులు వంట షెడ్ తదితర వాటిని పరిశీలించడం జరిగింది. విద్యార్థులకు లభిస్తున్న వివిధ రకాల సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాలను సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం తాండూరు మండలానికి మంజూరు చేయడానికి గల అవకాశాలను పూర్తిస్థాయిలో అడిగి తెలుసుకుని పరిశీలించడం జరిగింది. జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ పరిశీలించిన అంశాలపై నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్ గారికి అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. వారి వెంట తాండూరు మండల విద్యాధికారి శ్రీ మల్లేశం, సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఆల్ ఇండియా పోలీస్ కోకో ఛాంపియన్షిప్ కు ఎంపికైన కానిస్టేబుల్ ను అభినందించిన జిల్లా ఎస్పీ

జగిత్యాల,: జిల్లా ఆర్మ్ రిజర్వుడు విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న తుడి మల్లేశం ఆగస్టు 18 న జరిగిన తెలంగాణ పోలీస్ కోకో సెలక్షన్ విభాగంలో జగిత్యాల జిల్లా పోలీసు శాఖ తరఫున పాల్గొని పంజాబ్ రాష్ట్రంలో జరిగే ఆలిండియా కోకో పోలీస్ క్రీడాలకు ఎంపిక కావడం జరిగింది. తెలంగాణ పోలీస్ శాఖ నుండి కోకో విభాగంలో ఆల్ ఇండియా పోలీస్ క్రీడలకు ఎంపికైనందుకు మల్లేశం ను ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ



కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

## హాలో మాల చలో అసెంబ్లీ

### మాల నాయకుల ముందస్తు అరెస్ట్

కోరుట్ల: హాలో మాల చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్ళనున్న మాల సంఘ నాయకులను జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ, మండల నాయకులను కోరుట్ల పోలీసులు ముందస్తుగా గురువారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి వర్గీకరణను ముందుకు తీసుకు వస్తుందని ఆరోపించారు. పార్లమెంటులో ఆమోదం తెలిపితే వర్గీకరణ జరగదని రాష్ట్రాల తో ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఎస్సీ వర్గీకరణ జరగదని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. బిజెపి ఓట్ల రాజకీయంతో ఎస్సీల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, దుంపల రాజనర్సయ్య, డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, భూపెల్లి నగేష్ ,మాల సంఘ పట్టణ అధ్యక్షుడు పొట్ట లక్ష్మణ్, సామ ల వేణుగోపాల్, గంగారెడ్డి, రాజశేఖర్, శంకర్ రాజేందర్, మురళి, శేఖర్, సురేష్, లింగం తదితరులు ఉన్నారు.

# వైకాపా తీరుతో ఫైబర్‌నెట్ దివాళా

## సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి వెల్లడి

అమరావతి,డిసెంబర్19 : వైకాపా ప్రభుత్వం తీరుతో ఏపీ ఫైబర్‌నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ప్రస్తుతం దివాళా అంచున ఉందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. దర్శకుడు రాంగోపాల్ వర్మకు అప్పటి అధికారులు అక్రమంగా రూ.2.10కోట్లు చెల్లించారని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో జీవీ రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు ఇంటర్నెట్ సేవలు అందించడమే లక్ష్యంగా 2016లో సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారన్నారు. 2019 నాటికి 24వేల కి.మీ మేర కేబుల్ వేసి 10లక్షల కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ఇవాళ ఆ సంఖ్య 5లక్షలకు పడిపోయింద న్నారు. 'ఏపీ ఫైబర్‌నెట్ సంస్థలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గత ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్లను వేధింపులకు గురిచేసింది. అప్పటి ఎండీ మధుసూదన్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. వైకాపా నేతల అక్రమాలు బయటపడకుండా కీలక దస్త్రాలు మార్చేశారు. కీలక డాక్యుమెంట్లను వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి ఓ మహిళా ఉద్యోగి చేరవేశారు. మెను ఉద్యోగం నుంచి తొలగించాం. అనవసర ఖర్చులు తగ్గించుకుని నిధులు సమీకరించుకుంటాం. 'వ్యూహం' సినిమాన్ను ÷బైర్‌నెట్‌లో టెలికాస్ట్ చేసి అక్రమంగా దర్శకుడు రాంగోపాల్‌వర్మ (ఆర్జీవీ)కి చెల్లింపులు చేశారు. ఎక్కడా లేనివిధంగా అప్పటి అధికారులు వ్యవహరించారు. ఆ సినిమాకు 18 లక్షల వ్యూస్ వస్తే రూ.2లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.2.10 కోట్లు ఇచ్చారు' అని జీవీ రెడ్డి వివరించారు.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.